సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలో పలు ఈద్గాలలో ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గోల్కొండ పరిధిలోని సెవెన్ టోంబ్స్ వద్ద వందలాదిగా ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. అక్కడ చిన్నారులు సైతం భక్తిశ్రద్ధలతో పెద్దవారిని అనుసరించడం ప్రధానంగా ఆకట్టుకున్న దృశ్యం.

బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి

కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన పంకజ్ షిండే



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన పాతబస్తీ బీఆర్ఎస్ పార్టీ యువ నేత పంకజ్ షిండే

అబిడ్స్, జూన్ 17: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పార్టీ యువ నేత పంకజ్ షిండే అన్నారు. పాతబస్తీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నేత శ్రీ ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పంకజ్ షిండే తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో పంకజ్ షిండే కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పంకజ్ షిండే మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు పాటు పడ్తానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. తెలిపారు.

'నండూరి' మరణంపై సాహితీ ప్రియుల సంతాపం

సిటీబ్యూరో, జూన్ 17(నమస్తే తెలంగాణ): ప్రముఖ వ్యంగ్య, హాస్య రచయిత, సీనియర్ పాత్రికేయులు నండూరి పార్థసారథి(85) మరణంపై పలువురు సాహితీ ప్రియులు సంతాపం తెలిపారు. మెదడు సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ జూన్ 14న తుది శ్వాస విడిచారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పార్థసారథి వైవిధ్యమైన రచనా శైలితో తెలుగువారికి, ప్రధానంగా సాహితీలోకానికి అత్యంత సుపరితులయ్యారు. ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ నండూరి రామ్మోహన్ రావు స్వయాన సోదరుడైన పార్థసారథి సాహిత్య రంగంలో ఎనలేని సేవలందించారు. 1957లోనే రచనా రంగంలోకి అడుగుపెట్టి రాంబాబు డైరీ, పిబరే హ్యూమరసం, అయోమయ రాజ్యం, సాహిత్య హింసావలోకనం, కార్టూనాఖ్యానం, జేబీ మావయ్య పాటలు, శిఖరాలు-సరిహద్దులు వంటి రచనలు చేశారు. సంగీత, నృత్య, నాటక, చిత్ర, శిల్ప, వాస్తు కళలపై సాధికారిక విశ్లేషణలతో రసమయి సాంస్కృతిక మాస పత్రికను 2000-09 వరకు నిర్వహించారు. లలిత కళలలపై కొన్ని వందల విమర్శనాత్మక వ్యాసాలు రాసిన ఆయన ఆంధ్రప్రభలో పాత్రికేయుడిగా సేవలందించారు. ప్రత్యేకమైన రచనా శైలితో వ్యంగ్య, హాస్య రచనల ద్వారా తెలుగు పాఠకులకు చేరువైన నండూరి పార్థసారథి మరణంపై పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన మరణం సాహితీలోకానికే బాధాకరమని వయోధిక పాత్రికేయ సంఘం ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు కె.రామచంద్రమూర్తితో పాటు, పలువురు సీనియర్ జర్నలిస్టులు, రచయిత వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

స్వచ్ఛతలో కార్పొరేట్ భాగస్వామ్యం!

చెత్త వేసే, హాని కలిగించే ప్రాంతాలపై సీసీ కెమెరాలతో 24/7 నిఘా

పారిశుద్ధ్య నిర్వహణలో సీఎస్ఆర్ విధానానికి శ్రీకారం ◆ పైలెట్ ప్రాజెక్టుగా ఎల్బీ నగర్ జోన్‌లో అమలు

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): స్వచ్ఛ హైదరాబాద్‌లో 'కార్పొరేట్' సంస్థలను భాగస్వామ్యం చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా వందకు వంద శాతం ఇంటింటికీ చెత్త సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగానే తరచు చెత్త వేసే ప్రాంతాల (గార్బేజి వుల్నేరబుల్ పాయింట్లు/ జీవీపీ/ చెత్త నుంచి హాని కలిగించే పాయింట్ల)పై యాక్షన్ ప్లాన్‌పై రూపొందించి అమలు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాల్లో తరచు చెత్త వేస్తున్నట్లు గుర్తించి వీటిని పూర్తి స్థాయిలో ఎత్తి వేసేలా చర్యలకు ఉపక్రమించారు. ఈ జీవీపీ పాయింట్ల ఎత్తివేత విషయంలో ఇప్పటికే కాలనీలు, అసోసియేషన్ సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు స్వచ్ఛ హైదరాబాద్‌పై విస్తృత అవగాహన కల్పించారు. కొన్ని సందర్భాల్లో జీవీపీ వద్ద చెత్త వేసే వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించారు. రాత్రి పూట కొనసాగే హోటళ్లు, ఇతర తినుబండారాల దుకాణదారులు, స్థానిక ప్రజలతో జీవీపీ గాడిలో పడటం లేదు. ఈ తరుణంలో జీవీపీ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి 24x7 నిఘా ఉంచాలని తాజాగా నిర్ణయించారు. ఈ మేరకు స్వచ్ఛ హైదరాబాద్, జీవీపీ పాయింట్ల ఎత్తివేతపై ప్రత్యేకంగా కాలనీ, అసోసియేషన్ సంఘాలతో జోనల్ వారీగా సమావేశాలు జరిపారు. ఇక్కడే స్వచ్ఛ హైదరాబాద్‌లో కార్పొరేట్ సంస్థలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించి, ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టుగా ఎల్బీనగర్ జోన్‌లోని ఉప్పల్‌లో ఓ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దశలవారీగా అన్ని జీవీపీ పాయింట్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతామని అధికారులు తెలిపారు.

ఉచితంగా ఫొటోగ్రఫీ డిప్లమా

హిమాయత్‌నగర్, జూన్ 17: భాషా, సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ రంగాల్లో ఆరు నెలల పాటు 'ఆఫ్, ఆన్‌లైన్'లో ఉచితంగా డిప్లమా కోర్సుకు శిక్షణ ఇస్తున్నామని సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ చైర్మన్ ఏం.సి.శేఖర్ సోమవారం తెలిపారు. ఫొటోగ్రఫీపై అభిరుచి గలవారు, వృత్తిగా స్వీకరించే వారికి ప్రాథమిక ఫొటోగ్రఫీతో పాటు పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలు, కంపోజీషన్, లైటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ డిప్లమా కోర్సు శిక్షణ తరగతులు రవీంద్ర భారతిలో జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్ నెం: 80080 21075, 70956 92175 లలో సంప్రదించి ఈ నెల 30వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

మీడియా అవార్డులకు హై బిజ్ ఆహ్వానం

సిటీబ్యూరో, జూన్ 17(నమస్తే తెలంగాణ): మీడియా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ఉత్తమ కథనాలతో సేవలందిస్తున్న పాత్రికేయులకు అవార్డులను అందించనున్నట్లు హైబిజ్ టీవీ మీడియా సంస్థ తెలిపింది. మీడియా రంగంలో సుదీర్ఘ అనుభవంతో గత మూడేళ్లుగా పాత్రికేయులకు అవార్డులను పంపిణీ చేస్తుండగా, నాలుగో ఎడిషన్ హై బీజ్ టీవీ మీడియా అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాతో పాటు జర్నలిజం, మార్కెటింగ్, సర్క్యులేషన్ విభాగాల్లో ఉన్న మీడియా ప్రతినిధులు ఈ అవార్డులకు అర్హులుగా పేర్కొంది. జూన్ 20లోగా https:hybiz.tv/hybiz-media-awards-2024 లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి సమస్యలపై శంఖారావం

బస్తీలు, కాలనీలలో ఎమ్మెల్యే మాగంటి పాదయాత్ర

జూబ్లీహిల్స్, జూన్ 17: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నేటి నుంచి సమస్యలపై శంఖారావం కార్యక్రమం చేపట్టనున్నారు. సమస్యారహిత డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు బస్తీలు, కాలనీలలో అధికారులతో కలిసి పాదయాత్ర చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ డివిజన్ల నుంచి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. సమస్యలపై శంఖారావం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని కమలాపురి కాలనీలో అన్ని విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి పర్యటించి సమస్యలను పరిశీలించనున్నట్లు కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్ తెలిపారు.

కుండపోత వర్షం.. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

బల్కంపేటలో ఐదు గంటల పాటు విద్యుత్ అంతరాయం

నగరంలో 20కి పైగా ప్రాంతాల్లో నేల కూలిన చెట్లు

భారీ వర్షానికి గ్రేటర్‌లో అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థ

సిటీబ్యూరో, జూన్ 17(నమస్తే తెలంగాణ): నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోతగా కురిసిన వర్షం దాటికి విద్యుత్ వ్యవస్థ అతలాకుతలమైంది. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో మొదలైన వర్షంతో భారీ చెట్లు, వాటి కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బల్కంపేట, బీకే గూడలో 3.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, రాత్రి 8.30 గంటలు దాటినా పునరుద్ధరణ చేయలేదు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లో తొమ్మిది సర్కిళ్లు ఉండగా, అందులో రాజేంద్రనగర్, సరూర్‌నగర్‌లు మినహా మిగతా ఏడు సర్కిళ్లలో చాలా చోట్ల విద్యుత్ తీగలపై చెట్లు, వాటి కొమ్మలు పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధానంగా బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మధురానగర్, బీకే గూడ, మోతీనగర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీల్లో అంధకారం నెలకొంది. గంటల తరబడి విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా చోట్ల చెట్లు, వాటి కొమ్మలే విద్యుత్ లైన్లపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు వివరణ ఇచ్చారు.

ట్విట్టర్‌లో ఫిర్యాదుల వెల్లువ..

భారీ వర్షానికి నగరంలో చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు చేశారు. చెట్లు, వాటి కొమ్మలు విద్యుత్ తీగలపైన కాకుండా సబ్ స్టేషన్ నుంచి వచ్చే ఫీడర్, ట్రాన్స్‌ఫార్మర్స్‌పై పడటంతో వాటిని తొలగించేందుకు గంటల సమయం పట్టింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురై ఫిర్యాదులు చేశారు. కొన్ని చోట్ల భారీ వృక్షాలు నేలకూడంతో వాటిని జీహెచ్ఎంసీ అత్యవసర బృందాలతో కలిసి విద్యుత్ శాఖ అధికారులు తొలగించేందుకు ఎక్కువ సమయం పట్టిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈదురు గాలులతో వర్షం కురిసిన ప్పుల్లా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం తలెత్తి, గంటల తరబడి కరెంట్ రావడం లేదని బల్కంపేటకు చెందిన కళ్యాణ్ వాపోయారు. ఇలా సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దాన్ని పునరుద్ధరించేందుకు కొన్ని చోట్ల 4-5 గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు.

విద్యుత్ అంతరాయం కలిగిన ప్రాంతాలు..

- సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో 11 కేవీ అంజయ్య నగర్ ఫీడర్‌పై చెట్ల కొమ్మలు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- బంజారాహిల్స్ సర్కిల్‌లోని 11 కేవీ కళ్యాణ్ నగర్ పార్కు ఫీడర్ లైన్‌లో అంతరాయం తలెత్తింది.
- సికింద్రాబాద్ సర్కిల్‌లోని 11 కేవీ దండు పెంటయ్య ఫీడర్, మెట్టుగూడ ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపోయింది.
- మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 11 కేవీ ఏపీఐఐసీ కాలనీ ఫీడర్‌లో జంపర్‌లు తెగిపోవడంతో విద్యుత్ అంతరాయం తలెత్తింది.
- హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని గుడి మల్కాపూర్ సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కేవీ అంబాగార్డెన్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే విధంగా 11 కేవీ ఎం.డీ లైన్స్‌లోనూ విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడ్డాయి.
- హబ్సిగూడ సర్కిల్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో అంతరాయం కలిగింది.

నేలకొరిగిన వందేండ్ల మర్రి

ఈదురు గాలుల బీభత్సం

కూలిన వృక్షం.. ఒకరికి గాయాలు

మూడు బైకులు ధ్వంసం

మెహిదీపట్నం, జూన్ 17: కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకీ నుంచి గోల్కొండ రహదారిలోని ఎండీ లైన్స్‌లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో, వందేండ్ల నాటి మర్రి చెట్టు కుప్పకూలింది. చెట్టు కింద నిలబడి ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, పార్కింగ్ చేసిన మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్టు కింద ఉండే మాంసం దుకాణం సోమవారం మూసి ఉంచటం వలన ప్రమాదం తప్పింది. దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. భారీ మర్రి వృక్షం రోడ్డుపై కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. డీఆర్ఎస్ సిబ్బంది రంగంలోకి దిగి చెట్టు కొమ్మలను తొలగించారు.

కానిస్టేబుల్‌కు అభినందన

ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్

సిటీబ్యూరో, జూన్ 17(నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షా రాసేందుకు వెళ్తే ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఓ యువతిని సమయానికి పరీక్షా కేంద్రానికి చేర్చిన ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా అభినందించారు. ఆదివారం జరిగిన యూపీఎస్సీ పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన యువతి రాజేంద్రనగర్‌లో పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి ఉంది. అయితే, బక్రీద్ కారణంగా రోడ్లపై నెలకొన్న ట్రాఫిక్‌లో యువతి చిక్కుకోవడం, దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్ వెంటనే స్పందించి తన వాహనంపై సదరు యువతిని సకాలంలో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లాడు. దీంతో యువతి ఊపిరి పీల్చుకుని పరీక్షా కేంద్రంలోకి సమయానికి వెళ్లగలిగింది. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి విధి నిర్వహణతో పాటు సాటి మనిషికి సహాయం చేయడం బాధ్యతగా వ్యవహరించిన సురేశ్‌ను అభినందించారు.

వైద్యుల బదిలీలలో కొనసాగుతున్న వివక్ష

డీఎంఈ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్

సుల్తాన్ బజార్, జూన్ 17: గత కొన్నేండ్ల నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో వైద్యుల సాధారణ బదిలీల విషయంలో వివక్ష కొనసాగుతూనే ఉందని, ఈ వివక్ష ఇక మీదట భవిష్యత్తులో జరుగకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డీఎంఈ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్ సోమవారం కోరారు. 20 ఏండ్ల నుంచి ప్రభుత్వాలు వెలువరించే సాధారణ బదిలీల జీవోలకు విరుద్ధంగా జీవోలు వెలువడాలని, కొంత మంది అసోసియేషన్ పేరిట వివిధ జిల్లాల్లోని మెడికల్ కళాశాలల్లో పని చేస్తున్న వైద్యులని అవమానించేటట్లు పోస్టులు పెడుతున్నారని, అంతే కాకుండా గాంధీ, ఉస్మానియా వంటి వైద్య కళాశాలల్లో పనిచేయడానికి వీలు లేదని వితండ వాదం చేస్తూ వైద్య విద్యను అపహాస్యం చేసేటట్లు ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. సంఘాల ముసుగులో పని చేస్తున్న వీరు సంఘాలలో ఉన్న ప్రాథమిక సభ్యులకు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్యులకు సమన్యాయం కలిగేటట్లు పోరాడాలి. కాని, తమ స్వార్థ బుద్ధితో తాము తప్ప వేరే ఎవ్వరూ గాంధీ, ఉస్మానియా వైద్య కళాశాలల్లో పని చేయడానికి వీలు లేనట్లుగా వారి సొంత ఆస్తులుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. దయచేసి అటువంటి సంఘాల మాటలు నమ్మి వైద్యులను అపహాస్యం చేయకండి అని ఆయన కోరారు. జిల్లాలలో పని చేస్తున్న వైద్యులకు అండగా ప్రభుత్వం నిలబడాలని ఆయన కోరారు.

జీవోను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రామ రాజేష్ ఖన్నా

సుల్తాన్ బజార్, జూన్ 17: ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు సంబంధించి 510 జీవోను సవరించి నాలుగు వేల మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆయన ఉద్యోగులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ దేశంలోని మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలలో రెగ్యులరైజ్ చేసిన తరహాలో ఆయా రాష్ట్రాల జీవోలను బట్టి 510 జీవోను సవరించి తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం పరిధిలో విధులు నిర్వహిస్తున్న నాలుగు వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఆయా రాష్ట్రాలలో రెగ్యులరైజ్ చేసిన కాపీలను ఆయన మంత్రికి అందజేశారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నాలుగు వేల కుటుంబాలలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తానన్నారు. 510 జీవోను సవరించాలని మంత్రి ఫోన్‌లో అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి ఒక క్యాడర్ ఫిక్స్ చేసి క్యాడర్‌కు కొంత వేతనం ఇచ్చే విధంగా నూతన కమిటీకి శ్రీకారం చుడుతామని మంత్రి తెలిపారన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం, త్వరలోనే సమాన పనికి సమాన వేతనాన్ని త్వరలోనే ఇస్తామన్నారు. ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కొంత సమయం పడుతుందని మంత్రి వివరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీ మోహన్, ఆయుష్ డిపార్ట్‌మెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అరుంధతీ రాయ్ ప్రాసిక్యూషన్‌ను నిలిపివేయాలి

సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కార్యదర్శి పోటు రంగారావు

ముషీరాబాద్, జూన్ 17: అరుంధతి రాయ్, షేక్ షౌకత్ హుస్సేన్‌లపై పెట్టి ఉపా చట్టం పేరుతో ప్రాసిక్యూషన్ చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. కాశ్మీర్ సమస్యపై మాట్లాడిన అరుంధతీ రాయ్‌పై 14 ఏండ్ల కిందట నమోదైన ఉపా కేసును తిరగదోడి వేధింపులకు గురిచేయడం శోచనీయమన్నారు. విద్యానగర్‌లోని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక అంశాలపై విశ్లేషణ చేసిన అరుంధతీ రాయ్‌పై ఉపా కేసులు పెట్టి ప్రధాని మోడీ, అమిత్ షాలు ఉద్యమించే వారిని అణిచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. మోడీ, అమిత్ షాలకు ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం గౌరవం ఉన్నా ప్రజాస్వామిక వాదులు, హక్కుల కోసం ఉద్యమించే వారిని హింసించే చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, కె.రమ, కె.సూర్యం, ఎస్ఎల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎంబీలో నేడు వాక్ ఇన్..



సిటీబ్యూరో, జూన్ 17(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ(సీసీఎంబీ)లో ప్రాజెక్టు అసోసియేట్ ఉద్యోగాల భర్తీకి మంగళవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు నేచురల్ సైన్స్, బీ టెక్, మెడిసిన్ రంగాల్లో చదివిన వారు అర్హులు. 35 ఏండ్లకు మించకుండా, యూజీసీ నెట్, గేట్ సాధించిన వారు ప్రధానంగా అర్హులని పేర్కొన్నారు.